వెంకటేశం మేష్టరుగిరి

'స్వాతి శ్రీ'

వెంకటేశం మేష్టరు అయినాడు! అందులోనూ హైస్కూలు మేష్టరు! ఆయన మేష్టరు అయినాడంటే నమ్మలేకపోయినాం. నిజంగా అలాజరుగుతుందని ఎవ్వరూ అనుకోలేదు. నామటుకు నేను కల్లోకూడ అనుకోలేదు. అసలు ఆయనలో మేష్టరు అనే లక్షణాలు ఏమిలేవు. ఆయనకు మామూలు మనుష్యులవలేకాక ఒక హస్తం ఎక్కువవుంది. అదే చాదస్తం! ఆ చాదస్తంలోనూ అన్ని దినుసులూ సమానంగా పడ్డాయి. ఆయన గట్టిగా ఎవ్వరితోనూ మాట్లాడలేదు. ఆయనను మా ఊళ్ళో ఎరుగనివారు వుండరు. బాగా సనాతన ఆచారం గలవాడు. ఆయన పౌరోహిత్యం చేస్తూ కాలం వెళ్ళపుచ్చుతూ వుంటాడు. ఎక్కడ ఏ సుభకార్యమైనా అక్కడ తారసిల్లుతూ వుంటాడు. ఆయన చాలా పెళ్ళిళ్ళు చేయించాడు. ఆయనకయినా ఎన్నోఏళ్ళు ఉండవు! మహా వుంటే ముప్పయి ఏళ్ళు వుంటాయేమో! అంతకంటే వుండవు. పిల్లాజెల్లాకలవాడు.

నాలుగు ముక్కలు చదువుకున్నవాడు! ఆయన ఏ విషయమ్మైనా క్షుణ్ణంగా ఆలోచిస్తాడు. తిండిలోకూడ అంతే! ఏ ఒక్క ఆధరువుకి అన్యాయం కలుగకుండా చూస్తాడు. ఇక భోజనాలకి వస్తే ఛీఫ్ జస్టిస్‌లాగా ప్రతికేసూ "హియిరింగు"కు పెడ్తాడు. కేసు బాగుంటే మళ్ళీహియిరింగుకు పిలుస్తాడు. అలాగని చెప్పి మిగతా కేసులకు అన్యాయించేయడు. ఆ భోజనం కాసేపు బెంచిక్లార్కుకు చేతినిండాపని. ఇహ పెళ్ళిళ్ళ విషయములో చెప్ప నే అక్కరలేదు! ప్రతి చిన్న క్రతువూ సక్రమంగా జరిపించుతాడు. కాస్త జాగు అవుతుందేమోకానీ, దేనినీ ఆయన వదలిపెట్టడు. అందాకా ఎందుకు? మొత్తం మీద ఆయన చూడటానికి కాలానికి కాస్త వెనుక పడినవాడిలా కనుపిస్తాడు.

ఇంతకీ ఆయన మేష్టరు అయినాడు! అదే అందరికీ ఆశ్చర్యం కలిగించింది. ఆయన ఎలా మేష్టరు అయినాడనేది అందరికీ అనుమానం. నాకూ కలిగింది ఈ అనుమానం. ఒకసారి ఆయన నాకుకనపడితే, ఈ విషయమే అడిగాను. ఆయన చెప్పింది వింటే నాకు నిజంగానవ్వువచ్చింది. ఆయన ఒకసారి బంధువుల ఇంట్లో పెళ్ళి అయితే వెళ్ళాడట! అక్కడి పెళ్ళికి వచ్చిన వారిలో పరంధామయ్యగారని చీరాల హైస్కూలు హెడ్మాష్టరు వెంకటేశంకి కనపడ్డాడట. ఆయన వెంకటేశంకి బంధువేనట! ఏదో మాటల్లో వెంకటేశంని "తెలుగులో పరీక్షలేమైనా ప్యాసయినావా" అని అడిగాడట. ఏదో "ఎంట్రెన్సు" పరీక్ష ప్యాసయినానని సమాధానం చెప్పా

డట. ఇంకేముంది! ఆయన "చాలు ఆ మాత్రం పరీక్ష ప్యాసయివుంటే జూనియర్ తెలుగు పండిట్‌గా పనికివస్తా"నని అన్నాడట. వెంటనే తనే స్వయంగా ఒక అప్లికేషన్ వ్రాసి, వెంకటేశం చేత సంతకం పెట్టించాడు. ఎక్కడో అక్కడ జూనియర్ తెలుగు పండిట్‌గా, వేయిస్తానని చెప్పి ఆ అప్లికేషన్ తన వెంట తీసుకొని వెళ్ళాట్ట. అంతే! తరువాత ఆ అప్లికేషన్ ఏమయినది వెంకటేశంకి తెలియదుట. వారం గడచింది! పది రోజులు అయినాయి!! పదిహేను రోజులుకూడా దాటాయి!!! కాని ఆర్డర్లు మాత్రమే రాలేదు. ఆ పరంధామయ్యగారు పరధ్యాన్నంగా, ఆ అప్లికేషన్‌ను బుట్టదాఖలు చేశాడో ఏమో! ఇక్కడ వెంకటేశం "చేచిక్కిన అవకాశము జారిపోయినట్లు" బాధపడ్డాడు. చాలా ఆందోళన పడ్డాడు. తనకా యోగం లేదనుకున్నాడు. చివరికి ఎలాగయితేం ఆయనకు అదృష్టం కలసివచ్చింది. నెల రోజులయినాక ఆయనకు "ఆర్డర్లు" చేతికి వచ్చినాయి. కపిలేశ్వరపురం వేశారు. వెంకటేశంకి కంటివెంట ఆనంద బాష్పాలు వచ్చినాయి. ఉత్తరం తెచ్చిన పోష్టుజవానుకి తన సంతోషం కొద్దీ తృణమో పణమో ఒక పావలా ఇచ్చి పంపించాడు. తనకి అదృష్టం ఇన్నాళ్లకు కలసివచ్చినందుకు చాలా సంతోషించాడు. ఆయన ఇంట్లో ఆరోజు పిండివంటలతో భోజనం చేశారు.

ఇది ఆయన నాకు చెప్పింది. "నిజంగా అదృష్టం అంటే అలా ఉండా"లని మనస్సులో అనుకున్నాను. "సరే! మీరు ఎప్పుడు వెళ్ళి జాయనవుతా" రని అడిగాను.

"వారం రోజులు దాక గడువు ఉన్నది. రేపు విదియనాడు వెళ్లి ప్రవేశిస్తాను-మంచి చెడూ చూచుకోవాలిగా!" అన్నాడాయన.

"ఇంతకీ మీ జీతం ఎంతండీ?" అని అడిగాను.

"ఆ, ఏదో మొత్తం అన్నీ కలుపుకొని 45 రూపాయిలదాకవస్తుంది" అంటూ ఆయన వెళ్లి పోయాడు.

సరే తీరా ఆర్డరు వచ్చిన తరువాత వెంకటేశంకి ఒక సంశయం వచ్చింది. తను తీరా వెళ్లి ఉద్యోగంలో చేరితే, అక్కడ పిల్లలతో నెగ్గగలుగుతాడో లేదో అని. ఈఅనుమానాన్ని ఆయన స్నేహితుడు అవధానులకు మాటల సందర్భములలో చెప్పాడు. నాలుగు ముక్కలు చెప్పగలిగి పిల్లలతో నెగ్గటం పెద్ద కష్టంలేదని అవధాన్లు చెప్పాడు. దానితో వెంకటేశం కొంత సమాధాన పడ్డాడు. అవధాన్లు మాటకారి. ఆయన ఏదో చలోక్తిగా "అంతగా నీకు భయంగా వుంటే ఆ ఆర్డరు

ఏదో నాకు ఇచ్చేయి. నేనన్నా వెళ్లి జాయను అవుతాను.'' అన్నాడు. దానితో వెంకటేశంకి చాలా భయంవేసింది. తను ఇంట్లో లేనప్పుడు చూచి ఎప్పుడో అప్పుడు వచ్చి, అవధాన్లు ఆ ఆర్డరు కాస్తా కాజేస్తాడేమోనని అనుమానం కలిగింది. వెంటనే అవధాన్లు అటు వెళ్లి పోగానే ఆ ఆర్డరును గట్టిగా పెట్టెలో పెట్టి తాళంచెవి తన బొడ్లో పెట్టుకున్నాడు. చెప్పేనుగా! వెంకటేశంకి చాదస్తం అని. ఆయన భయానికి కారణం లేకపోలేదు. వెంకటేశంతోబాటు అవధాన్లుకూడా ''ఎంట్రెన్సు'' పరీక్షకు కూర్చున్నాడు. అయితే వెంకటేశం ప్యాసయినాడు అవధాన్లు తప్పాడు. అప్పటినుంచి అవధాన్లుకు వెంకటేశం అంటే కన్నెర్రగా వుంది. వెంకటేశం చేసే ప్రతి పనికీ, అవధాన్లు పోటీగా వస్తుంటాడు. వెంకటేశంకి ఒక్కటే భయం. తీరా అవధాన్లు, తనకు తెలియకుండా ఆ ఆర్డరు కాస్తా కాజేసి, ఆ కపిలేశ్వరపురం వెళ్లి, తనే వెంకటేశంనని చెప్పి ఉద్యోగంలో చేరితే తను చేయగలిందేమీ లేదు. అందువల్లనే చాలా జాగ్రత్తగా వున్నాడు. సరే! ఏమవుతే అది అవుతుంది. ఉద్యోగాన్ని మటుకు వదలిపెట్ట దలచుకోలేదు వెంకటేశం. కపిలేశ్వరపురంవెళ్లి ఆ ఉద్యోగంలో చేరటానికే నిశ్చయించుకున్నాడు. దానికి తగినట్లుగా ఆయన భార్యకూడా, భర్త ఉద్యోగం చేస్తే చూద్దామని మనసుపడి ఉన్నది. ప్రయాణానికి అన్నీ ఏర్పాట్లూ చేసుకొన్నాడు. తను ముందువెళ్లి ఉద్యోగంలో జాయిన్ అయి, ఇల్లూ వాకిలీ అన్నీ ఏర్పాట్లూ చూచుకొని, తరువాత కుటుంబ సమేతముగా వెళ్లటానికి నిశ్చయించు కున్నాడు.

ఇంతలోనే పరంధామయ్యగారు ఏదో పని మీద మా ఊరువచ్చారు. ఆయన వచ్చేటప్పటికి వెంకటేశంకి బ్రహ్మానందమయింది. ఆయన కపిలేశ్వరపురం హైస్కూలు హెడ్మాష్టరుని ఎరుగునట! ఇంకేం! ఆయనకు వెంకటేశంగారిని పరిచయం చేస్తూ ఒక ఉత్తరం వ్రాసిఇచ్చాడు. పరంధామయ్యగారు వెళ్తూ ''హెడ్ మాష్టరుగారిని కాస్త కనిపెట్టుకుండమని, అవసరమైతే, ఆయన ఇంట్లో ఏదైనా శుభకార్యమైతే, వెళ్లిపని జరిపించ''మని సలహాయిచ్చాడు. ఆ ఉత్తరాన్ని వెంకటేశం భద్రంగా దాచి పెట్టుకున్నాడు. మర్నాడు ఉదయం వెంకటేశం నున్నగా గుండు చేయించి, ముస్తాబయి బయలుదేరాడు. అప్పుడే అర్థంచేసుకున్నాను, ఈయన ఉద్యోగంలో జాయిన్ అవటానికి వెళ్తున్నాడని.

ఆయన అటువెళ్లగానే, మా వూళ్లో ప్రతివాళ్లు ఆయన గురించే మాట్లాడుకోవడం మొదలుపెట్టారు. ఆయనకు

అదృష్టం ఇన్నాళ్లకు పట్టిందన్నారు. ఆయన కష్టాలు గట్టెక్కినాయన్నారు. అవును! కష్టాలు గట్టెక్కినాయి! కాకపోతే మా వూళ్ళో ఆయన ఎంత కష్టపడితే మాత్రం నెలకి మొత్తం ముప్ఫయి రూపాయిలయినా సరిగా వచ్చేవి కావు. ఆయన అదృష్టం పండింది. మంచి ఉద్యోగం దొరికింది. 'ప్రయోజకుడే మొత్తానికి' అన్నారు ఉద్యోగాన్ని చూచి మనిషికి విలువనిచ్చే వృద్ధులు. వెంకటేశంను చూచి అసూయ పడేవాళ్ళూ లేకపోలేదు. "అసలు మనిషిని చూచి ఉద్యోగం ఇచ్చివుండరు! ఈయన సంగతి బాగా తెలిసివుంటే వద్దు బాబూ! అనే వాళ్ళే" అన్నారు అసూయతో కొందరు నిరుద్యోగులు. ఇహ "మేడలు కడతాడు చూచుకో – ఆయన కేం! రెండు సంపాదనలాయె! ఇటు స్కూలు వాళ్లు ఇచ్చే జీతం, అటు తీరికవున్నప్పుడెల్లా బ్రహ్మణార్థం మీద వచ్చే డబ్బు? ఇవి కాక ఆయనకు ఓపిక వుంటె పిల్లలకు ప్రయివేట్లు చెప్పి బోలెడంత సంపాదించవచ్చు-ఒక్కటేమిటి! ఇహ ఆయనకు ఏమి తక్కువ" అని కూడా అనటం మొదలు పెట్టారు వారిలో కొందరు. ఇహ వేళాకోళానికి పిల్లలు "కపిలేశ్వరపురానికి, ఈ కపివరేణ్యుడు వెళ్లాడు. ఇహ ఆ స్కూలులో వినోదానికి తక్కువేమున్నది? పిల్లలకు మంచి కాలక్షేపం" అన్నారు. ఇదంతా వింటుంటే నాకు ఆయనమీద ఒకవిధమైన జాలి వేసింది. పాపం పిచ్చి బ్రాహ్మడు! ఆయనంటే వాళ్లందరకీ ఎందుకింత అసూయ? ఆయనకు మంచి ఉద్యోగం దొరికితే వారందరూ ఎందుకు బాధ పడాలి? అసలు వారందరినీ బాధపెట్టే విషయం వేరేవున్నది. ఊళ్ళో చదువుకున్న వాళ్లు కొంతమంది నిరుద్యోగులుగా ఉండగా, అందరూ చూస్తుండగానే గమ్మత్తుగా ఆయనకు ఉద్యోగం దొరికింది. అదే వాళ్ల బాధ.

వెంకటేశం కపిలేశ్వరపురం చేరాడు. వెళ్లగానే హెడ్మాష్టరుగారిని కలుసుకొని, తనకు వచ్చిన ఆర్డరు, పరంధామయ్యగారు వ్రాసియిచ్చిన ఉత్తరం చూపించాడు. హెడ్మాష్టరుగారు కాసేపు ఆలోచించి "వెంకటేశంగారూ! ఒక్క విషయం-మాకు ప్రస్తుతం కావలసినది సీనియర్ తెలుగుపండిట్. ఎందువల్లనంటే, ఇది వరలో మా స్కూలులో పనిచేస్తున్న సీనియర్ తెలుగుపండిట్, ఈమధ్యనే మానుకోవటం వలన ఆ పోస్టు ఖాళీ అయింది; మీకు అభ్యంతరం లేకపోతే మీరు హైక్లాసులు తీసుకోండి. క్రింద క్లాసులకు ఎవ్వరినైనా అడ్డం పెట్టుకొని తంటాలు పడతాం. ఇక జీతం విషయంలో, మిమ్మల్ని జూనియర్ పండిట్‌గా వేయటం వలన, హెచ్చింపేమీ వుండదు" అన్నాడు. వెంకటేశం కొద్దిగా గాబరా పడ్డాడు. తర్వాత ఎట్లాగో తమాయించుకున్నాడు.

"ఏమిటి సంశయిస్తున్నారు? మిమ్మల్ని సీనియర్ పండిట్‌గా ఉపయోగించుకోమని బోర్డువారు మాకు వ్రాశారు" అని దబాయించాడు హెడ్మాష్టరు. ఈయన అవతారంచూచి, అప్పుడే ఈయన సంగతి కనిపెట్టినట్లున్నాడు! సరే! ఇహ చేసేదేమీ లేదని వెంకటేశం అభ్యంతర పెట్టలేదు. తను దానికి ఒప్పుకోకపోతే ఉద్యోగం తీసివేస్తారేమోనని భయపడ్డాడు. అప్పటికీ మనస్సులో పీకుతునే వున్నది. తనని తక్కువ జీతంతో ఎక్కువ పని చేయించుకుంటున్నారని; కానీ ఏం చేస్తాడు!

"సరే, అయితే ఇవాళే జాయిను అవండి" అన్నాడు హెడ్మాష్టరు. ఆవేళే వెంకటేశం స్కూలుఫైనలు క్లాసుకు తెలుగుపద్యం చెప్పటానికి వెళ్లాడు. క్లాసులోకి ఠీవిగానే వెళ్లాడు. లోపల భయంగా వున్నా, పైకి బింకంగానే వున్నాడు. వెళ్లి సరాసరి కుర్చీలో కూర్చున్నాడు. పిల్లలు మామూలుగా ఆయన వస్తుంటే నించుని తరువాత కూర్చున్నారు. అప్పుడే వెనుక బెంచీలో పకపకలు బయలు దేరినాయి. వెంకటేశం పాఠం మొదలు పెట్టాడు. కొంటె పిల్లలు అట్టే కనిపెట్టారు — ఈయన సంగతి. వెంటనే అవకతవక ప్రశ్నలు వేయటం మొదలుపెట్టారు. అక్కడక్కడ కొన్ని కఠినపదాలకి అర్థాలు చెప్పమన్నారు. ఇంకేముంది! వెంకటేశం నోరెళ్ల పెట్టాడు. కఠిన పదాలకి అర్థం చెప్పమంటే ఆయనేం చెప్పగలడు? ఇంటి దగ్గర ఆపాఠం ఒకసారి చదివి తయారయి వుంటే అప్పుడు ఎలావుండేదో పరిస్థితి! ఏమయినా హైక్లాసు పిల్లలకి పాఠం చెప్ప గలశక్తి ఆయనలోలేదు. ఆయన ఎప్పుడూ ఎవ్వరికీ పాఠం చెప్పలేదాయె! ఏదో చిన్నక్లాసులయితే ఎట్లాగోట్లా తంటాలు పడేవాడు. మొత్తంమీద ఆ రోజున క్లాసులో గందరగోళం జరిగింది. అటాగే మూడురోజులు కాలక్షేపం చేశాడు. క్లాసులో గందరగోళం ఏమీ తగ్గలేదు. పకపకా నవ్వటం, వెక్కిరించటం, చొప్పదంటు ప్రశ్నలు వెయ్యటం ఒకటేమిటి! ఆయనను ఏడిపించడానికి వారికి చేతనయిన చేష్టలన్నీ చేశారు. ఏమయినా అది కపిలేశ్వరపురమాయె! ఇక వెంకటేశం బొమ్మలు బ్లాకుబోర్డు మీద ప్రత్యక్షమయ్యాయి కొంతమంది కొంటెపిల్లలు "ఏమండీ! మీరు ఎప్పుడు వెళ్లిపోతారండీ" అని కూడా ధైర్యంచేసి అడిగారు. ఇక అటువంటి పిల్లలకి ఆయనేం పాఠం చెప్పగలడు! మొత్తంమీద పిల్లలు ఆయనను ఆ ఊరునుండి వెళ్లగొట్టడానికి, వారికి తెలిసిన జిత్తులన్నీ ప్రయోగించారు. దానితో వెంకటేశంకి, ఆ ఊరంటేనే ఒకవిధమైన భయంవేసింది. అదే క్లాసుకు శాస్త్ర పాఠం చెప్పగలవాడు, పిల్లలని

హడల గొట్టగలవాడూ వెళితే పిల్లందరూ బుద్ధిమంతులే! ఇదివరలో ఎంతమంది మేష్టర్లు ఆ క్లాసుకు వెళ్లి పాఠం చెప్పలా! వెంకటేశం అటు పాఠం సరిగా చెప్పలేడు; ఇటు పిల్లలనీ భయపెట్టలేడు. ఆయనకు రెండూ చేతకాదు. అదే వెంకటేశంకి, మిగతావారికీ వున్న పెద్దతేడా! ఇంతకీ వెంకటేశుని అనవలసిన అవసరము ఏమున్నది! ఈయన సంగతి సరిగా తెలుసుకోకుండా ఉద్యోగం ఇచ్చిన బోర్డువారిది తెలివితక్కువ! తెలిసివుండికూడా ఉద్యోగం కోసం ప్రయత్నం చేసిన పరంధామయ్యగారిది అంతకంటే తెలివితక్కువ!! అయినా ఆయనను సరాసరి పెద్ద క్లాసులకు వేస్తే, ఆయనేం పాఠం చెప్పగలడు? చిన్న క్లాసులయితే ఎట్లాగోట్లా తంటాలు పడేవాడేమో! ఏమో అదీ నాకు అనుమానమే! ఏది ఎలావున్నా వెంకటేశం అభాసు కావలసిన యోగంవున్నది. అందుకే ఇదంతా జరిగింది.

ఇహ నాలుగో రోజున పరిస్థితి మరీ విషమించింది. క్లాసులో చప్పుడు చెయ్యటం అరవటం, పిల్లికూతలు పెట్టటం మొదలు పెట్టారు. ఇంకా పీరియడ్‌లో సగం కాలేదు, ఇంతలోనే క్లాసులో ఢాం అని పెద్ద చప్పుడు అయింది. అంతే! •వెంకటేశంకూడా 'ఢాం' అని కుర్చీలోంచి క్రింద పడ్డాడు. పిల్లలంతా పక్కున నవ్వారు. వెంకటేశంలేచి తెప్పరిల్లుకొని, గబగబా పరిగెత్తుకుంటూ వెళ్లి హెడ్‌మాష్టరుగారి గదిలోనికి దూరాడు. పిల్లలు వెంటపడతారేమోనని ఆయనకు భయం వేసింది. హెడ్‌మాష్టరుగారు ఆయన గబగబరావటం చూచి ఆశ్చర్యపడ్డాడు. వెంకటేశం సరాసరి వెళ్లి ఒక గుక్కెడు మంచినీళ్లు త్రాగి ఆ గదిలోనే ఒక కుర్చీలో కూర్చున్నాడు. హెడ్మాష్టరు అంతా అర్థం చేసుకున్నాడు. కాసేపు ఆగిన తరువాత వెంకటేశం "నన్ను చిన్న క్లాసులకు వెయ్యండి. నేనా స్కూలుఫైనలు క్లాసుకు వెళ్లను" అన్నాడు. "ఏం?" అన్నాడు హెడ్ మాష్టరు.

"ఆ...! ఏమీలేదు" అన్నాడు వెంకటేశం.

అవును! ఏమని చెప్పుకుంటాడు ఆ సంగతులన్నీ! హెడ్మాష్టరుకూడా మూడు రోజులనుంచి ఆ క్లాసులో జరుగుతున్న గోల కనిపెడుతున్నాడు. ఇప్పుడు అయిన ఆ చప్పుడుకూడా ఆయనకు వినపడ్డది. ఆయనా, వెంకటేశంని ఎలా వదిలించుకుందామా అని యోచిస్తున్నాడు.

"అయితే ... ... మీరు స్కూలు ఫైనలుకు చెప్పలేనంటారా?" అన్నాడు హెడ్‌మాష్టరుగారు. వెంకటేశం కాసేపు సంకోచించి ఇక ఎట్లాగో తను ఆక్లాసు

పిల్లలతో వేగలేక "చెప్పలేనండి" అన్నాడు.

"అయితే యెట్లా! మాకు ప్రస్తుతం స్కూలు ఫైనలు క్లాసుకు పాఠం చెప్పగలవాడు కావాలి, మీవల్ల కాకపోతే, ఒకపని చెయ్యండి. మీరు శలవుపెట్టి వెళ్ళిపోండి. బోర్డువాళ్ళే మిమ్మల్ని ఇంకెక్కడన్నా ఖాళీ వస్తే జూనియర్ పండిట్‌గా బదిలీచేస్తారు" అన్నాడు హేడ్మాష్టరు. వెంకటేశంకి ఈ సలహానచ్చింది. వెంకటేశం దూరం ఆలోచించాడు. తను శలవుపెట్టితే ఇంకెక్కడికయినా బదిలీచేస్తారు. అక్కడ యెట్లాగో జూనియర్ పండిట్‌గావేస్తారు గనుక తనకు పాఠంచెప్పటం అట్టే కష్టం అనిపించదు. సరే! వెంటనే శలవు పెట్టాడు.

వెంకటేశం వెళ్ళగానే హేడ్మాష్టరుగారు ఆ క్లాసుకు వెళ్ళి ఆ చప్పుడు ఎట్లా అయిందని గద్దించి అడిగాడు. సరే పిల్లలు చెప్పక తప్పిందికాదు. ఒక కొంటెకుర్రాడు దీపావళి టపాకాయలలోని ఆటంబాంబును క్లాసులో ఎవ్వరూ చూడకుండా కాల్చాడట! హేడ్మాష్టరుగారు ఆ కుర్రాడికి ఫైన్ వేశాడు.

వెంకటేశం మావూరు చేరుకున్నాడు. ఇహ ఊళ్ళో గసగుసలు బయలుదేరినాయి. ఎవ్వరు అడిగినా శెలవుపెట్టి వచ్చానన్నాడు. తనని ఇంకెక్కడికయినా బదిలీ చేస్తూ ఆర్డర్లు వస్తాయేమోనని, రోజూ పోష్టు ఆఫీసు చుట్టూ తిరగడం మొదలు పెట్టాడు. దానికి బదులు వెంకటేశం పేర ఒక మనియార్డరు వచ్చింది. అక్కడ స్కూలులో, నాలుగురోజులు పని చేసినందుకు జీతం లెక్కగట్టి పంపించారు. ఇంకో నెలరోజులు జరిగినాయి. ఆర్డర్లు మాత్రము రాలేదు. అంతే! ఆయన అప్పటికీ, ఇప్పటికీ సెలవుమీదే వున్నాడు.

డాక్టరు కే. యన్. కేసరిగారి రచన

'నా చిన్ననాటి ముచ్చట్లు'

వెల రు. 3-0-0

అన్నిహిగిన్ బాదమ్స్ స్టాల్సులోను దొరుకుతవి.